# మైనస్ మార్కు



రచన: శ్రీ బి. వి. డి. ప్రసాదరావు

ఆటో ఆ ఇంటిముందు ఆగింది.

అందులోంచి మేం బయటపడ్డాం.

మాకు మర్యాద అయిన ఆహ్వానం లభించింది.

ఆ ఇంట్లోకి నడిచాం. తర్వాత ఓ గదిలోకి వెళ్ళాం.

ఆ గది చాలా అందంగా వుంది. పెళ్ళిచూపుల కోసమే అలంకరించినట్టుంది.

కుర్చీల్లో మేం కూచున్నాం అతను చెప్పగా, అతను పెళ్ళికూతురు తండ్రి.

ఇక, మేం అంటే - నేను, చిన్నాన్న, పిన్ని.

అమ్మపోయిన తర్వాత, నన్ను పిన్ని చేరదీసింది.

అమ్మకంటే ముందు నాన్న పోయారు.

పిన్నికి, చిన్నాన్నకు నేనంటే ప్రాణం. బహుశా, వాళ్ళకు మగపిల్లలు లేరనేమో... వాళ్ళకు ఇద్దరు కూతుళ్ళు. పెద్దది రాజ్యం. రెండోది రమణి. వాళ్ళిద్దరికీ పెళ్ళిళ్ళు అయిపోయాయి.

చిన్నాన్న నీడలో నేను చిన్నప్పట్నించీ చక్కగా చదువుకుని డిగ్రీని ఫస్టుక్లాసులో పూర్తి చేశాను.

ఉద్యోగరీత్యా నేను కాకినాడలో ప్రస్తుతానికి వుంటున్నాను. నేనో జాతీయ బ్యాంకులో పని చేస్తున్నాను.

నన్ను ఓ ఇంటివాణ్ణి చెయ్యాలని పిన్ని, చిన్నాన్న ప్రతి ఉత్తరంలోనూ పాడుతుండేవారు.

వాళ్ళ కోరికపై ఇప్పటికి నాలుగు సంబంధాలు చూశాను. కానీ, నాకు అవి నచ్చలేదు. అందంవుంటే, చదువు లేదు... చదువు వుంటే, అందం లేదు... రెండూ వున్న అమ్మాయి దొరకదా? అన్న సందేహం నన్ను పట్టి పీడిస్తోంది.

మొన్న చిన్నాన్న వద్ద నుంచి ఉత్తరం

వచ్చింది. అతని కోరికపై నాలుగు రోజులు సెలవు పెట్టి వచ్చాను.

ఏదో రెండు సంబంధాలు రాజమండ్రిలో వున్నాయి... వెళ్ళి, చూద్దాం... చిన్నాన్న చెప్పారు రాగానే.

అందుకే మేం ఇలా వచ్చాం-

అమ్మాయిని చూడాలన్న ఆత్రం నాలో చిక్కగావుంది.

గది గుమ్మంలోనే నా చూపులు కూచున్నాయి.

చిన్నాన్న, పెళ్ళికూతురు తండ్రి మాటల్లోకి చొరబడ్డారు. ఏవేవో వాళ్ళు మాట్లాడేసుకుంటున్నారు.

పిన్ని మూగగా ఎటో చూస్తూ కూచుంది.

కొన్ని క్షణాల తర్వాత ఓ 10, 12 సంవత్సరాల అమ్మాయి వచ్చింది. ఆమె చేతిలో ఓ పెద్ద పళ్ళెం వుంది. అందులో చిన్న చిన్న పళ్ళెలు... వాటిలో ఏవేవో టిఫిన్లు వున్నాయి.

మా అందరికీ తలా ఒక్కొక్క పళ్ళెంను అందించేసి ఆ అమ్మాయి వెళ్ళిపోయింది. వెంటనే మరో పళ్ళెంతో మళ్ళీ వచ్చింది. ఆ పళ్ళెంను టీపాయ్ మీద వుంచేసి వెళ్ళిపోయింది. ఆ పళ్ళెంలో మంచి నీళ్ళ గ్లాసులు, మూత లున్న కాఫీగ్లాసులు వున్నాయి.

నేనో స్వీటును తినేసి, మిగిలిన స్వీట్సును, హాట్‌ను విడిచి పెట్టేశాను.

అది గమనించినట్టు, పెళ్ళికూతురు తండ్రి, 'మరొకటి తీసుకో, బాబూ!' అన్నారు నాతో.

అందుకు నేనేదో చెప్పాలనుకుంటున్నాను...

అంతలోనే -

వాడు రెండోసారి టిఫిన్ చెయ్యడండీ... వస్తూ, టిఫిన్ చేసే వచ్చాం...' చిన్నాన్న చెప్పారు.

చిన్నగా నవ్వుకున్నాను.



LPC(R)



ఎల్. పి. సి. మోనోబ్లాకు రెండు స్టేజి డీప్ వెల్

- జెట్ పంపులు -

రెండు స్టేజి పంపులు ఎక్కువగా అతి ప్రెషర్‌లో సాధారణ జెట్ పంపుకన్నా నీళ్ళ నందించును.

ఎంత లోతైన బావినుంచి అయినా సరే మా మోనోబ్లాకు జెట్ పంపు సెట్టులు అతిసులువుగా మీకు నీళ్ళు అందించును.

½ H.P. నుంచి 5 H.P. వరకు దొరకును.

: వివరములకు :

Grams: "NAIDUBROS" Phone: Office: 24997 Works; 22757

THE EL-P-EM INDUSTRIALS

393, Mettupalayam Road (P.B. No. 1053) COIMBATORE-641002


నిజానికి, అతిగా ఇలాంటి సమయాల్లో తింటే బావుండదని నా భావం. అదే మొదటిసారి పెళ్ళి చూపులకు వెళ్ళినప్పుడు చిన్నాన్నతో చెప్పాను అప్పటినుంచి అతను ఏదోలా సర్దుకుంటూ వస్తున్నారు.

మేం వచ్చిన పది నిమిషాల తర్వాత అమ్మాయిని చూపించారు.

కూతురును తీసుకువచ్చింది, ఆమె తల్లి. అమ్మాయి వద్దికగా మా ముందు, చాప మీద కూచుంది, తల వంచుకుని వుంది.

నేను ఆమెను నిశితంగా చూస్తున్నాను. ఆ అమ్మాయిని చూసిన మొదటి క్షణంలోనే నేను అప్రతిభుడ్ని అయిపోయాను.

ఆమెనుంచి చూపులు మార్చుకోలేక పోతున్నాను. కళ్ళు మిరుమిట్లుగొలిపే ఆమె అందం, నిజంగా సూపర్బ్. 'అబ్బ! ఎంత అందంగా వుంది..!'

'ఇంతకీ, ఈ అమ్మాయి పేరేమిటో!... అడగాలని వుంది...

ఎలా?...ఎలా!...

'నీ పేరేమిటమ్మా?' ... ఆ గొంతు విని, తేరుకున్నాను. ఆ గొంతు పిన్నిది.

'సుమలత ...' నెమ్మదిగా చెప్పింది ఆ అమ్మాయి.

'అబ్బ! ఎంత స్వీట్‌గా వుంది ... ఆమె గొంతూ! - ఊఁ - ప్లస్ - ఆమె పేరు కూడా'.

అప్పటికే, అందంలో ఆ అమ్మాయి ఒక ప్లస్ మార్కును స్కోర్ చేసేసుకుంది...మరి, ఏం చదివిందో?...

'ఏం చదువుకున్నావ్?' పిన్ని అడిగింది.

'బి. కాం.'

'పూర్తి అయిందా?'

'ఊఁ. సెకండ్ క్లాసులో...'

'గుడ్...మరో ప్లస్ మార్కు...'

'థాంక్ గాడ్...'మనసులో తృప్తిగా అనుకున్నాను.

'అన్నీ వున్న సుమలత నా కెంత వరకు నచ్చింది?' ప్రశ్నించుకున్నాను.

'పూర్తిగా నచ్చింది.'

మరి, సుమలతే నా భార్య...

నిజమే–

ఎందుకో నా వళ్ళు సన్నగా పులకిస్తోంది.

'వంట వచ్చా?' పిన్ని.

సుమలత ముసి, ముసిగా నవ్వింది ఎందుకో!!

ఆమె తల్లి సర్దుతున్నట్టు అన్నది. 'అంతగా రాదండి. అయినా, అన్నింటిలో నూ ప్రవేశం వుంది...'

పిన్ని చిన్నగా నవ్వేసి వూర్కుంది.

కాలం నిశ్శబ్దంగా నడుస్తోంది.

చిన్నాన్న కొన్ని క్షణాల తర్వాత, లేచి నించుని, మాట్లాడేరు: 'మరి, మేం వస్తామండీ! ఏ విషయం మీకు మరో వారం రోజుల్లో తెల్ప గలం, ఉత్తరం ద్వారా...'

నాకు చిన్నాన్న మీద భలేగా కోపం వచ్చింది. అతని తీరు నా కంతగా నచ్చలేదు.

'ఇంకా తెల్పడానికి ఏముంది!...కాలాన్ని వృధా చెయ్యడం ఎందుకో? ఇప్పుడే ఈ సంబంధాన్ని కుదుర్చుకుంటే పోలా?' మృదువుగా విసుక్కున్నాను, మనసులో.

'ఉండండీ! ఆటోను తీసుకు వస్తాను...' అంటూ సుమలత తండ్రి ... సారీ... కాబోయే మా మామయ్య లేచి, వీధిలోకి నడిచారు; చిన్నాన్న అడ్డుపడుతూన్న వినిపించుకోకుండా.

చిన్నాన్న మళ్ళీ కూచున్నారు.

సుమలతను తీసుకొని వెళ్ళిపోయారు, కొన్ని క్షణాల క్రితమే.

ఆ గదిలో మేం ముగ్గురమే మిగిలాం.

ఇందాకటి అమ్మాయి మళ్ళీ వచ్చింది. వెంటనే వెళ్ళిపోయింది, ఖాళీ సామానులను తీసుకొని.

'ఏమిటి?' అడిగాను.

'అమ్మాయి నచ్చిందా?'

ఏం చెప్పను?...ఎందుకో భయం–కాదేమో సిగ్గేమో...





మేము అతినూతనమైన యంత్రసాధనములను అమర్చి అతి సరసమగు, అత్యాకర్షణీయముగా, నేత్రానందకరమైన, జంకాళాలు మరియు బెడ్ షీట్లను తయారుచేయుచున్నాము. మహాశయులు మాకు చేయూతనిచ్చి అత్యధికముగా ఆర్డరు ఇవ్వవలెనని కోరుచున్నాము. మీ ఆర్డరును వెంటనే గమనించి సప్లై చేయుదుము.

(ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులోనే)

**Sivakumar Industrials**

BHAVANI - 638 301.

P. B. No. 38. Tel.: "Jamakalam",

Phone No.: 265

ఆగి చెప్పాను, పిన్ని కూడా రెట్టించి అడగడంతో - 'వచ్చింది'.

'మామ్మయ్యా! ఇన్నాళ్ళకు నీకు ఒకటి వచ్చింది...ఆ రెండోది కూడా చూసేస్తే'

చిన్నాన్నకు అడ్డు పడ్డాను : 'చిన్నాన్నా' అంటూ.

'ఏరా!!'

'మరి రెండోది చూడొద్దు'

'ఏరా!'

'ఇదే ఖాయం చేసేయండి' చెప్పాను నిక్కచ్చిగా.

పిన్ని, చిన్నాన్న మొహాలు చూసుకున్నారు తర్వాత -

'అలాగే...అదికూడా చూసేస్తే తప్పు ఏముంది? ఆ పిల్ల ఎలా వుందో? ఇంకా అర్హత కలిగినదైతే...'

'అవసరం లేదు... ఈ సంబంధమే కానివ్వండి...'

'బావుంది. అది చూడడంలో నష్టం లేదు కదరా?' పిన్ని అంది.

'ప్లీజ్, పిన్నీ! మరొద్దు. ఇదే అవ్వనిద్దురు'

'ఊఁ...సరే...నీ ఇష్టం...'

'ఇప్పుడే మాట్లాడేయమంటావా?' ఆగి, అడిగారు చిన్నాన్న.

'వద్దండీ! ఇంటికి పోయి వుత్తరం వ్రాద్దాం మనం మగపెళ్ళివారం' పిన్ని అంది.

పిన్ని వంక ఏదోలా చూశాను తప్ప, ఏమీ అనలేక పోయాను.

కొన్ని క్షణాల మౌనం...

మరోసారి సుమలత కనిపిస్తే బాగుంటుంది.

చిన్నాన్న లేచి, వీధి వైపు నడిచారు.

అంతలోనే, ఇంట్లో ఏదో గొడవ, చిన్నగా మరుక్షణంలోనే సన్నగా ఏడుపు...

పిన్ని సడన్‌గా లేచి, ఇంట్లోకి వెళ్ళింది. ఎందుకో? గొడవ అంతలోనే 'గప్ చుప్' అయిపోయింది!

'రా, రా, ఆటో వచ్చేసింది' చిన్నాన్న వచ్చి, పిలిచారు లేచి, అటు కదిలాను.

'పిన్ని ఏది?'

'లోపల వుంది.'

చిన్నాన్న లోపలికి చూస్తూ, పిన్నిని గట్టిగా పిలిచారు.

పిన్ని వచ్చింది. ఆమె వెనుకే సుమలత తల్లి కూడా వచ్చింది.

'వస్తామండీ!' - మేం ముగ్గురం చెప్పేసి, ఆటో ఎక్కాం.

ఆటో పరుగులు తీస్తోంది.

'పాపం! లేస్తూ ఎవరి మొహం చూసిందో!' అంది పిన్ని, నొచ్చుకుంటున్నట్టు.

'ఎవరు, పిన్నీ?' ఆశ్చర్యంగా అడిగాను. నిజానికి, ముందు నేనే అడగాలనుకున్నాను, 'ఏమిటా గొడవా?' అని.

'చూడు, మనకు టిఫిన్లు తెచ్చిందే, ఆ అమ్మాయి...సుమలత చెల్లెలట'

'ఏమైందేమిటి?' చిన్నాన్న అడిగారు.

'బాగా దెబ్బలు తిన్నది పాపం'

'ఎవరు కొట్టేరేమిటి?'

'సుమలత...'

'ఎందుకు?!' నే నడిగాను, గబుక్కున.

'తను చెప్పగానే, ఖాళీగ్లాసులను క్లీన్ చెయ్యలేదని'

'నీకెలా తెలిసింది?'

'ఆ దెబ్బలు తిన్న అమ్మాయి, ఆలా గొణుక్కుంటూ, ఏడుస్తోంది.'

నిశ్శబ్దం ఆటోలోకి సడన్ గా చొరబడింది... చాలాసేపు వుంది.

'చిన్నాన్నా' పిలిచాను, నిశ్చయంగా.

'ఊఁ'

'ఆటో ఎక్కడికి?'

'బస్సు స్టాండుకు'

'వద్దు...ఆ రెండో అమ్మాయిని చూస్తాం అటు పోనీయండి'

'అదేమిట్రా?!...' పిన్ని, చిన్నాన్న ఒకే సారి అడిగారు.

'అది అంతే'

'అంటే!!'

'ఏ ముంది...సుమలతతో దాంపత్య జీవితం సాఫీగా సాగదేమోనని నా భయం... ప్రతి దానికీ - అందులో చిన్న విషయానికి కూడా - నే నాడిందే ఆట పాడిందే పాట అని అనుకుంటున్నామెతో నే నెంత వరకు రాజీ పడగలను? ఏ మాత్రమైన సర్దుకుపోయె గుణం లేక పోతే ఎలా! ఎదుటివారు ఎట్లా భావిస్తారని కానీ, ఆలోచిస్తాంని కానీ, తను గమనించుకో లేక పోతే ఎలా? హుఁ కేవలం మేడిపండులాంటి ఆమె శారీరక అందంకు దాసోహం అయిపోతే, నే నెంత వరకు మానసికంగా సుఖపడగలను!

'ఏంట్రా అలా చూస్తూ వుండి పోయావ్! అసలు విషయం చెప్పు' నన్ను కుదుపుతూ చిన్నాన్న అడిగే సరికి, నేనాలోచనల్లోంచి బయట పడ్డాను...

నెమ్మదిగా తేరుకుంటూ - 'నాకీ సంబంధం వద్దు, చిన్నాన్నా' నెమ్మదిగా చెప్పాను.

'ఏరా!!'

'చిన్నాన్నా, ప్లీజ్!...మీరా విషయాన్ని విడిచి పెట్టెయ్యరూ' ఎటో చూస్తూ చెప్పాను.

చిన్నాన్న మరి మాట్లాడ లేదు.

కొన్ని క్షణాల మౌనం...తర్వాత-ఆటో దిశ మారి పోయింది, చిన్నాన్న మాట ప్రకారం.

ఇప్పుడు, నా మనసు పూర్తిగా ఖాళీ అయి పోయింది...ఈ ఖాళీ భర్తీ అయ్యేది ఇంకెప్పుడో!—



బనియన్ల తయారీలలో
మాదొక ప్రత్యేకత
అందుకే...
"టిప్ టాప్ బనియన్లు"
నాణ్యతకు ప్రసిద్ధి చెందియున్నది.
"టిప్ టాప్"
బనియన్లు కొని ధరించి ఆనందించండి.
: తయారించువారు :
Tip Top Hosiery Mfrs.,
35-28, Dharapuram Road,
TIRUPUR - 638 604.